ఈనాడు
ములుగు

23న పరిశ్రమల స్థాపనపై అవగాహన సదస్సు

ములుగు, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకంపై ఆసక్తి ఉన్న వారికి ఈనెల 23న ములుగులోని సంక్షేమ భవన్‌లో ఉదయం 10.30 గంటలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ అధికారి రమేష్ తెలిపారు. పరిశ్రమలు, సేవారంగం యూనిట్లు స్థాపించుకోవాలనుకునే వారి కోసం ఈ సదస్సు నిర్వహిస్తున్నామని, వివిధ పథకాలపై అవగాహన కల్పిస్తామన్నారు. జిల్లాలోని ఎస్సీలు, ఎస్టీలు, బీసీ, ఓబీసీ, ఓసీ, మహిళలు, వికలాంగులు, మాజీ సైనిక ఉద్యోగులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పర్యటిస్తూ.. పరిశీలన చేస్తూ..


హనుమకొండ నగరంలోని వేయిస్తంభాల ఆలయం వద్ద

వెంకటాపూర్, న్యూస్‌టుడే: రామప్పలో వరల్డ్ హెరిటేజ్ శిక్షణ శిబిరం కొనసాగుతోంది. ఈ శిబిరంలో పాల్గొంటున్న వాలంటీర్లు మంగళవారం కాకతీయుల రాజధాని ఓరుగల్లులోని పర్యాటక ప్రదేశాలను పరిశీలించారు. వరంగల్ నగరంలోని వేయిస్తంభాల గుడి, వరంగల్ కోట, భద్రకాళి ఆలయాలను సందర్శించారు. సాయంత్రం సౌండ్ అండ్ లైట్ షోను తిలకించారు. అనంతరం కాకతీయుల ప్రత్యేకత, ఆలయ నిర్మాణ శైలి, కాకతీయులు వాడిన సాంకేతిక పరిజ్ఞానం గురించి స్వయంగా తెలుసుకున్నారు. కాకతీయ హెరిటేజ్ ట్రస్టు, ప్రొఫెసర్ పాండురంగారావు, ట్రస్టు సభ్యుడు శ్రీధర్‌రావు, అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ అధికారి సూర్యకిరణ్, సౌండ్ అండ్ లైట్‌షో ఇన్‌ఛార్జి శ్రీనివాస్, పురావస్తుశాఖ జిల్లా అధికారి మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

ములుగు, న్యూస్‌టుడే: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు చేరేందుకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి, ఆయాపనులపై ప్రజలతో చర్చించిన తర్వాత అంచనాలు తయారుచేసి నివేదికలు సమర్పించాలన్నారు. అధికారులు, ఉద్యోగులు వారి పనితనాన్ని మెరుగుపర్చుకోవాలని, క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడే ప్రజల సమస్యలు తెలుస్తాయన్నారు. ఎన్ఆర్‌జీఎస్ పథకం నిధులను పంట పొలాలకు వెళ్లేందుకు దారుల నిర్మాణం, చెక్‌డ్యాంల ఏర్పాటు, అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు మొదలగు వాటికి ఉపయోగించుకోవాలని తెలిపారు. అన్నిశాఖల అధికారులు చేపట్టాల్సిన పనులపై ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. సమస్యలు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. వచ్చే మినీ మేడారం జాతరకు మేడారం గ్రామంలో భక్తులకు ఉపయోగపడేలా శాశ్వత పనులు చేపట్టాలన్నారు. సమావేశం అనంతరం 52 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, డీఎఫ్‌ఓ రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్లు సీహెచ్.మహేందర్‌జీ, జి.సంపత్‌రావు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పడేవారిని పార్టీ గుర్తిస్తుంది..


ప్రసంగిస్తున్న రాష్ట్ర మంత్రి సీతక్క

ములుగు: కష్టపడి పని చేసే వారిని పార్టీ గుర్తిస్తుందని, రాబోయే రోజుల్లో జిల్లాకు మరిన్ని నామినేటెడ్ పదవులు వస్తాయని మంత్రి సీతక్క అన్నారు. నూతనంగా నియమితులైన జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ బానోతు రవిచందర్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపునకు జెండా మోసిన ప్రతి ఒక్కరినీ కాపాడుకునే బాధ్యత తనపై ఉందన్నారు. దీపావళి పండగ లోపు రూ.2 లక్షల రుణమాఫీతో పాటు ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం జరుగుతుందన్నారు. రాబోయే రోజుల్లో కష్టపడిన వారికి పదవులు వస్తాయన్నారు. బాధ్యతలు స్వీకరించిన జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మాట్లాడుతూ. . జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎండి.రియాజ్, శాప్ ఛైర్మన్ శివసేనారెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, ములుగు అసెంబ్లీ ఎన్నికల ఇన్‌ఛార్జి కూచన రవళిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో అక్రమాలు..!

–న్యూస్‌టుడే, ములుగు



పేదలకు ఉపాధి కల్పించడంతో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణలేమితో సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి సామాజిక తనిఖీలు నిర్వహించి అక్రమాల నిగ్గు తేల్చుతున్నప్పటికీ.. తిరిగి చెల్లించాల్సిన సొమ్మును చెల్లించడం లేదు. పంచాయతీ కార్యదర్శులు అధికారుల అండతో చెల్లింపుల్లో నిర్లక్ష్యం చూపిస్తున్నారు.

● 2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని ఐదు మండలాల్లో సామాజిక తనిఖీలు నిర్వహించారు. కన్నాయిగూడెం, ఏటూరునాగారం, మంగపేట, ములుగు, గోవిందరావుపేట మండలాల్లో జరిగిన ఉపాధి హామీ పథకంపై గ్రామాల వారీగా సామాజిక తనిఖీలు చేపట్టారు. ఈ మండలాల్లో పంచాయతీ కార్యదర్శులు, సాంకేతిక సహాయకులు, ఇతరులు తప్పులు చేసినందుకు జరిమానా, దస్త్రాల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, ఉపాధి కూలీల హాజరు పత్రాల్లో కొట్టివేతలు, చేసిన పనులకు చెందిన ఎంబీ రికార్డుల గణాంకాల్లో తేడాల్లో అక్రమాలను రూ.4.18 లక్షలుగా నిర్ధారించారు.

● గ్రామసభల్లో నిర్ధారణ జరిగిన వారికి తప్పుల సవరణ తదితర అంశాలపై కొంత వెసులుబాటు కల్పిస్తారు. ఇందులో భాగంగా ఈ సొమ్ముకు సంబంధించి ఆయా పంచాయతీల కార్యదర్శులకు నోటీసులు జారీ చేసి, వారి నుంచి వివరణ తీసుకొని నిర్ధారించి రికవరీ సొమ్మును సవరణ చేయాల్సి ఉంది. ఇంకా ఈ ప్రక్రియ పూర్తి కాలేదు. దాంతో పాటు జిల్లాలోని మరి కొన్ని మండలాల్లో సామాజిక తనిఖీలే జరగలేదు.

2024-25 ఆర్థిక సంవత్సరంలో అక్రమాలను మొత్తం రూ.4.18 లక్షలుగా నిర్ధారించారు.

అధికారుల నిర్లక్ష్యం..

జిల్లాలో తొమ్మిది మండలాలు ఉండగా, వీటి పరిధిలో 174 పంచాయతీలున్నాయి. ములుగు, వెంకటాపూర్, తాడ్వాయి, గోవిందరావుపేట మండలాల్లో ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనులపై(2023-24) సామాజిక తనిఖీలు నిర్వహించారు. గ్రామసభ ఏర్పాటు చేసి వాస్తవాలను నిగ్గు తేల్చారు. ఇందులో వెంకటాపూర్ మండలంలోని ఐదు పంచాయతీలు, తాడ్వాయి మండలంలోని పదకొండు, గోవిందరావుపేట మండలంలోని ఎనిమిది, ములుగు మండలంలోని 31 పంచాయతీల్లో అవకతవకలు జరిగినట్లు తేల్చారు. ఈ నాలుగు మండలాల పరిధిలో జరిగిన అక్రమాలకు సంబంధించి రూ.1.97 లక్షలు జరిమానా, రికవరీ సొమ్ముగా నిర్ధారించారు. ఇందులో ఇప్పటివరకు రూ.7,418 మాత్రమే రికవరీ చేయగా, రూ.1.90 లక్షలు పెండింగ్‌లో ఉంది. సొమ్ము రికవరీ చేయడంలో అధికారులు అలసత్వం చూపిస్తున్నారనేది స్పష్టమవుతోంది.

2024-25 ఆర్థిక సంవత్సరం

మండలం	జరిమానా	రికవరీ చేయాల్సింది	మొత్తం
కన్నాయిగూడెం	23,071	56,500	79,571
ఏటూరునాగారం	6,057	25,500	31,557
మంగపేట	52,250	41,236	93,486
ములుగు	1,00,561	46,250	1,46,811
గోవిందరావుపేట	16,961	50,250	67,211


ఉపాధి పనులపై ఇటీవల దేవనగర్‌లో నిర్వహించిన గ్రామసభ

తప్పిదాలు జరగకుండా ఆదేశించాం..

– జవహర్‌రెడ్డి, ఎంపీడీవో, గోవిందరావుపేట

గోవిందరావుపేట, న్యూస్‌టుడే: గోవిందరావుపేట మండలంలో ఇటీవల జరిగిన సామాజిక తనిఖీలో పలువురు పంచాయతీ కార్యదర్శులకు ఉన్నతాధికారులు స్వల్పంగా జరిమానా విధించారు. రికార్డుల్లో జరిగిన తప్పుదాలకు సంబంధించి కొందరికి, కొలతల్లో తేడాలు, మస్టర్లు సరిగ్గా నమోదు చేయకపోవడంతో జరిమానా వేశారు. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా ఉండేందుకు ఆదేశాలు జారీ చేశారు. పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని సూచించాం.

పత్తిని ఆరబెట్టి తీసుకురావాలి


మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్.దివాకర

ములుగు, న్యూస్‌టుడే: రైతులు పండించిన పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చేటప్పుడు ఆరబెట్టి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎనిమిది శాతం తేమ మించకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. ఇంటి వద్దనే ఆరబెట్టుకోవాలన్నారు. పత్తి విక్రయాల సమాచారం తెలుసుకునేందుకు వీలుగా మార్కెట్ అధికారులు సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చారని తెలిపారు. గతంలో సమాచారం కోసం రైతులు ఇబ్బందులు పడేవారని, విక్రయాల్లో అక్రమాలను అరికట్టడంతో పాటు రైతులు ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకునేందుకు వీలుగా వాట్సప్ సేవలను అందుబాటులోకి తెచ్చారన్నారు. వాట్సప్ నెంబర్‌ను నమోదు చేసుకొని హాయ్ అని టైప్ చేసి సందేశం పంపడంతో పాటు తమ ఆధార్ కార్డు నమోదు చేస్తే కావాల్సిన వివరాలు తెలుసుకునే అవకాశం ఉందని, 8897281111 నెంబర్‌ను నమోదు చేసుకోవాలని కోరారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి పొరపాట్లు జరగకుండా వచ్చే 150 రోజుల పాటు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోళ్లు విజయవంతం చేయాలని సూచించారు. మార్కెటింగ్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'కమిటీ పేరుతో కాలయాపన'

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: కమిటీ పేరుతో ఎస్సీ వర్గీకరణ అమలులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాలయాపన చేస్తున్నాడని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు మడిపల్లి శ్యాంబాబు ధ్వజమెత్తారు. ఏటూరునాగారం పట్టణంలోని మంగళవారం ఐదు మండలాల ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల సబ్ డివిజన్ స్థాయి సమావేశాన్ని ఎంపెల్లి శంకర్ మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మాదిగలను మోసం చేస్తున్న విధానాన్ని నిరసిస్తూ.. ఈ నెల 26న ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి సదస్సును హనుమకొండలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మాదిగ సంఘాలన్నీ అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆ గట్టు వాన గుట్ట.. ఈ గట్టు వరాల కొండ


నీటి పాన్పులా రామప్ప సరోవరం


రెండు గుట్టల అనుసంధానంతో ఏర్పడిన రామప్ప సరస్సు

కాకతీయుల గొలుసుకట్టు సాంకేతిక పరిజ్ఞానానికి నిదర్శనం ములుగు జిల్లాలోని రామప్ప సరోవరం. ఒక వైపు వాన గుట్ట మరోవైపు వరాల గుట్టను కలుపుతూ 610 మీటర్ల పొడవుతో కట్టను నిర్మించారు. దీంతో 2.912 టీఎంసీల నీటి సామర్థ్యం గల రామప్ప సరస్సు ఏర్పడింది. ఒక్కసారి ఇది నిండితే రెండేళ్లకు సరిపడా ములుగు, భూపాలపల్లి జిల్లాల్లోని 178 గ్రామాలకు మిషన్ భగీరథ పథకం ద్వారా శుద్ధిజలాలు అందుతాయి. మరోవైపు వరంగల్ జిల్లా నర్సంపేట రంగాయచెరువు, పాకాల ఆయకట్టుకు, ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం, భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని సుమారు 10 వేల ఎకరాల ఆయకట్టుకు తిరుగుండదు. సుమారు 532 కుటుంబాల మత్స్యకారుల కుటుంబాలకు ఏటా రూ.6 కోట్ల ఆదాయవనరుగా, బోటు షికారుతో పర్యాటక శాఖకు ఏటా రూ.2- 3 లక్షల ఆదాయ వనరుగా ఉంది. దట్టమైన పచ్చని చెట్లతో రెండు కొండలను కలుపుతూ నీటి పాన్పులా ఉన్న రామప్ప సరస్సు మధ్యలోంచి 'న్యూస్‌టుడే' తీసిన చిత్రమిది. – న్యూస్‌టుడే, వెంకటాపూర్

నకిలీ పోడు పట్టాల తయారీ ముఠా అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న అటవీ శాఖ అధికారులు


నకిలీ పాసు పుస్తకం

ములుగు టౌన్, న్యూస్‌టుడే: నకిలీ పోడు పట్టా పాసుపుస్తకాలు తయారు చేసిన ఇద్దరిని అటవీ శాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఐఏఎస్, ఐఎఫ్‌ఎస్ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి పోడు పట్టా పాసుపుస్తకాలు తయారుచేస్తున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించి ఎఫ్ఆర్‌వో డోలి శంకర్ తెలిపిన వివరాలు ఇలా.. ఈ నకిలీ పోడు పాసుపుస్తకాల వ్యవహారంలో ఏడుగురు వ్యక్తులు సూత్రధారులుగా ఉన్నారు. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ముగ్దుంపురం గ్రామానికి చెందిన చాందావత్ భద్రు ములుగు మండలంలోని పలు మండలాల రైతుల నుంచి డబ్బులు తీసుకుని ఈ తతంగాన్ని నడిపించాడు. వరంగల్ నగరానికి చెందిన గణేష్ ప్రింటర్స్ యజమాని తాటిపాముల రాజు ఒక్కో పాసు పుస్తకానికి రూ.2 వేలు తీసుకుని నకిలీ పుస్తకాలు తయారు చేసేవాడు. ఆన్‌లైన్ సెంటర్ నడుపుతున్న నర్సంపేటకు చెందిన భూక్య వెంకన్న క్యూఆర్‌కోడ్ సృష్టించాడు. మహబూబాబాద్‌కు చెందిన బానోత్ హరినాయక్ హోలోగ్రామ్ తయారు చేశాడు. నర్సంపేటకు చెందిన ధారావత్ కిషన్ బ్యాంకు రుణాల కోసం అటవీశాఖ రేంజ్ అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసి క్లియరెన్స్ ధ్రువీకరణ పత్రాన్ని రూపొందించాడు. వెంకటాపూర్ మండలం ఇంచెంచెర్వుపల్లి గ్రామానికి చెందిన జాటోత్ రాజ్‌కుమార్ (ఎఫ్ఆర్సీ ఛైర్‌పర్సన్) అటవీ హక్కు పత్రం పాసు పుస్తకం నమూనా పంపించాడు. ములుగు మండలం కాసిందేవ్‌పేట గ్రామానికి చెందిన వాంకుడోత్ రవి ఏజెంటుగా వ్యవహరిస్తూ.. పాసుపుస్తకం కావాలన్న వారి దగ్గర డబ్బులు వసూలు చేసి వివరాలను భద్రుకి పంపించేవాడు. ఏడుగురు వ్యక్తులు ఈ దందాలో కీలకంగా వ్యవహరిస్తున్నారని, బ్యాంకులో రుణం పొందడానికి నకిలీ పోడు పట్టాల పుస్తకాలు తయారు చేసినట్లు విచారణలో తేలిందని ఎఫ్ఆర్‌వో తెలిపారు. మిగతా వారిని అదుపులోకి తీసుకుని విచారించిన తర్వాత కేసు నమోదు చేస్తామన్నారు.

'పొట్టేల్' సినిమా బృందం సందడి
మూడు వైపులా.. కష్టాలే! వివరాలు 6లో..

నేడు వనదేవతల హుండీ కానుకల లెక్కింపు

తాడ్వాయి, న్యూస్‌టుడే: ఈ నెల 23న వనదేవతలు సమ్మక్క, సారలమ్మ హుండీ కానుకలు లెక్కించనున్నట్లు కార్యనిర్వహణాధికారి రాజేంద్రం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు నెలల క్రితం వనదేవతల గద్దెలపై ఏర్పాటు చేసిన 20 హుండీలలోని కానుకలను మేడారంలోని భోజనశాలలో పూజారులు, అధికారుల సమక్షంలో లెక్కిస్తామని పేర్కొన్నారు.

వివాదాస్పద భూ సమస్యను పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటరెడ్డి

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ములుగు జిల్లాలో రెవెన్యూ, అటవీ శాఖల మధ్యన వివాదాస్పదంగా ఉన్న 40 వేల ఎకరాల భూమి సమస్యను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఏటూరునాగారం పట్టణంలో మంగళవారం సీపీఎం మండల మహాసభ ఎండీ. యాకూబ్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటరెడ్డి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. రైతు వ్యతిరేక చట్టాలకు, కార్పొరేట్ శక్తులకు పబ్లిక్ రంగ ఆస్తుల అమ్మకాలపై కేంద్ర ప్రభుత్వంపై కదం తొక్కాలన్నారు. జిల్లాలోని పోడు సాగుదారులకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తు కర్తవ్యాలను నిర్ణయించుకుని పోరాటాలకు ప్రజలను సన్నద్ధం చేసేందుకు నవంబర్ 29, 30న ఏటూరునాగారంలో సీపీఎం రెండవ జిల్లా మహాసభలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ మహాసభలకు ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బీరెడ్డి సాంబశివ, ఎండీ.దావూద్, పి.అరుణ్, వసంత నాగయ్య, చిటమట రమేష్, నర్సింహులు, కృష్ణ, విష్ణు, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

చర్యలుంటాయా.. మామూలేనా!

● సీఎంఆర్ బియ్యం బుక్కి రూ.కోట్లు గడించిన మిల్లర్లు

ఈనాడు, మహబూబాబాద్

ఉమ్మడి వరంగల్‌లోని కొంత మంది రైస్ మిల్లర్లు తమకు కేటాయించిన ధాన్యాన్ని మిల్లాడించి సకాలంలో బియ్యం అప్పగించకుండా పక్కదారి పట్టించి సొమ్ము చేసుకున్నారు. వీరిలో మూడు, నాలుగు సీజన్లకు సంబంధించి బియ్యాన్ని ఇవ్వని వారున్నారు. వీరికి పలుమార్లు గడువు ఇచ్చినా ఫలితం లేకపోయింది. క్షేత్రస్థాయిలో ధాన్యం నిల్వలను పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడంతో బకాయిపడ్డ మిల్లర్లు కొందరు ధాన్యాన్ని అడ్డదారిలో అధిక ధరలకు విక్రయించి రూ.కోట్లు గడించారు. వీరిపై ఈసారైనా చర్యలు తీసుకుంటారా లేదా ఎప్పటిలాగే 'మామూలు'గా వదిలేస్తారా అనేది చర్చనీయాంశంగా మారింది.


గత నెల 20న బియ్యం నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేటకు చెందిన శ్రీ లక్ష్మి పారాబాయిల్డ్ రైస్ మిల్లుకు 2022-23 యాసంగి సీజన్‌లో పౌరసరఫరాల శాఖ 62579.80 క్వింటాళ్ల ధాన్యం కేటాయించింది. మిల్లరు సీఎంఆర్ కింద ధాన్యం మరాడించి 42553.58 క్వింటాళ్ల బియ్యం అందజేయాల్సి ఉండగా 24,336 క్వింటాళ్లు మాత్రమే ఇచ్చి మిగతాది బకాయిపడ్డారు. అందుకు సంబంధించిన రూ.6.49 కోట్ల విలువైన 26,790 క్వింటాళ్ల ధాన్యం నిల్వలు మాయమైనట్లు పౌరసరఫరాల శాఖ రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం గత నెల 20న మిల్లులో చేపట్టిన దాడుల్లో గుర్తించింది. ఈ మిల్లు జిల్లాలో పేరున్న ఒక మాజీ ప్రజాప్రతినిధిది. గతేడాది వానాకాలం సీజన్‌లో ధాన్యం కేటాయింపు నిలిపివేయగా అధికారులపై ఒత్తిడి తెచ్చి ధాన్యం కేటాయింపులు చేయించుకున్నారు.

● మహబూబాబాద్ జిల్లా కురవి మండలం మొగిలిచెర్ల శివారులోని నవ్య పారాబాయిల్డ్ రైస్ మిల్లుకు 2022-23 సీజన్‌లో పౌరసరఫరాలశాఖ 53,560 క్వింటాళ్ల ధాన్యాన్ని కేటాయించింది. మిల్లర్లు సీఎంఆర్ కింద 36,240 క్వింటాళ్ల బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉండగా 8,871 క్వింటాళ్లు మాత్రమే ఇచ్చారు. ఇంకా 27,549 క్వింటాళ్ల బియ్యం ఇవ్వాలి. మిగతా 40,513 క్వింటాళ్ల ధాన్యంలో కేవలం 6,238 క్వింటాళ్ల ధాన్యం మాత్రమే నిల్వ ఉన్నట్లు గుర్తించారు. దాంతో మిల్లరు ప్రభుత్వానికి రూ.8.36 కోట్లు నష్టపరిచినట్లు గత నెల 21న మిల్లులో తనిఖీ చేసిన రాష్ట్ర పౌరసరఫరాల టాస్క్‌ఫోర్స్ బృందం పేర్కొంది.



ఇలా జరగాలి..

మిల్లులకు ధాన్యం కేటాయించిన తర్వాత అక్కడ లెక్క ప్రకారం నిల్వలున్నాయా.. లేవా, మిల్లాడిస్తున్నారా.. లేదా అనేది క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు జిల్లాల వారీగా పౌరసరఫరాలశాఖ వద్ద సరిపడా సిబ్బంది లేదు. దాంతో పర్యవేక్షణ బాధ్యతలను జిల్లా స్థాయిలో రెవెన్యూ అదనపు కలెక్టర్లు, మండల స్థాయిలో డిప్యూటీ తహసీల్దార్లకు అప్పగించారు. వారు మిల్లులను పరిశీలించి బియ్యం నిల్వల నివేదికలను రాష్ట్ర అధికారులకు అందించాలి. తేడా లున్న మిల్లులకు మరో సీజన్‌కు సంబంధించి ధాన్యం కేటాయింపు నిలిపివేస్తారు.

ఇదీ జరుగుతోంది..

మిల్లర్ల అక్రమాలపై ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వకపోవడం వల్లనే ఒక సీజన్‌ది కాస్త నాలుగు సీజన్లకు పెరిగింది. ఇందుకు అధికారులు మిల్లర్ల నుంచి రూ.లక్షల్లో ఆమ్యామ్యాలను పుచ్చుకుంటూ ధాన్యం కేటాయింపులకు సహకరించారు. గత ప్రభుత్వ హయాంలో కొన్ని మిల్లలకు సామర్థ్యానికి మించి ధాన్యాన్ని కేటాయించారు. అప్పుడు కూడా అధికారుల అండదండలతో పక్కదారి పట్టించారు.

ఇదీ పరిస్థితి..

ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా 94 మంది రైస్ మిల్లర్లు బియ్యం అప్పగించ లేదు. ● వీరిలో రెండు, అంతకంటే ఎక్కువ సీజన్లు బకాయి ఉన్న వారికి ప్రస్తుత సీజన్ నుంచి ధాన్యం కేటాయింపు నిలిపివేయాలనేది పౌరసరఫరాలశాఖ నిర్ణయించింది. మిల్లర్లు కొందరు ధాన్యం కేటాయింపుల కోసం గతంలో మాదిరిగానే అధికారులను మచ్చిక చేసుకోవడానికి మంతనాలు చేస్తున్నట్లు తెలిసింది.

బియ్యం బకాయిపడ్డ మిల్లర్లు (సీజన్లవారీగా)

జిల్లా	ఒకటి	రెండు	మూడు	నాలుగు	మొత్తం
హనుమకొండ	19	3	1	1	24
జనగామ	9				9
భూపాలపల్లి	9				9
వరంగల్	24	5			29
మహబూబాబాద్	16	5			21
ములుగు	5	1			6

మూడు వైపులా.. కష్టాలే!

● పద్మవ్యూహంలో హనుమకొండ బస్టాండ్ ● ఛేదించడానికి ఉన్నాయి మార్గాలు

పరిశీలన

నిత్యం వేలాది ప్రైవేటు వాహనాలు, కార్ల రాకపోకలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి వెళ్లే బస్సులు, ద్విచక్ర వాహనాలు ఇవన్నీ హనుమకొండ బస్టాండు ప్రాంతంలో కనిపించే ట్రాఫిక్ కష్టాలు. నగరవాసులు ఆ మార్గంలో వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ఉమ్మడి వరంగల్‌కు కీలకమైన హనుమకొండ ప్రధాన బస్టాండులో ట్రాఫిక్ ఇబ్బందులు, ప్రత్యామ్నాయ మార్గాలపై 'న్యూస్‌టుడే' పరిశీలన కథనం..

–హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే

ఎవరికి నచ్చినట్టు వారు..



ఆటోలు, ఫుట్‌పాత్‌లపై వాహనాలు

బస్టాండు లోపలికి వెళ్లే రెండు దారులు గందరగోళంగా ఉంటాయి. ఆటో వాలాలు ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తుంటారు. కొందరు ఆటో డ్రైవర్లు బస్టాండు నుంచి వచ్చే ప్రయాణికులను ఎక్కించుకునేందుకు అక్కడే చక్కర్లు కొడుతూ ట్రాఫిక్ సమస్యలు తెస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్‌లకు వచ్చే వారి వాహనాలతో రోడ్డు మొత్తం బ్లాక్ అవుతోంది.

కట్టడి చేయడం కీలకం

☛ ఆటోవాలాలు క్రమ పద్ధతిలో ప్రయాణికులను ఎక్కించుకునేలా చూడాలి. ☛ బస్టాండు రోడ్డుకు రెండు వైపులా ప్రైవేటు ఆసుపత్రుల వారు ఆక్రమించుకున్న ఫుట్‌పాత్‌లను ఖాళీ చేయించాలి. పాదచారులు నడిచేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలి.



1 ఇది కేడీసీ రోడ్డుకు వెళ్లే దారి.. బస్సులన్నీ దీని ద్వారానే బయటకు వెళ్లాలి





2 ఇది కీలకమైన జంక్షన్ దారి.. దీన్ని మూసివేయడంలో ప్రైవేటు వాహనాలకు అడ్డాగా మారింది.

మూడు మార్గాలు ఉన్నా..

బస్టాండు లోకి వెళ్లడానికి మూడు దారులున్నాయి. కేడీసీ రోడ్డుకు వెళ్లే దారి, బస్టాండు జంక్షన్ పక్కన ఒకటి, మసీదు పక్కన మరొకటి. అన్ని మార్గాల గుండా వచ్చే బస్సులు మసీదు పక్కన ఉన్న గేటు నుంచే బస్టాండ్‌లోనికి అనుమతి ఇస్తున్నారు. వందలాది బస్సులు ఇదే మార్గంలో లోపలికి రావడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. మరోవైపు బస్సులన్నీ కేడీసీ దారిలో ఉన్న గేటు గుండా బయటకు వెళ్తుంటాయి.. కీలకమైన బస్టాండ్ జంక్షన్ దారిని ప్రమాదాలు జరుగుతున్నాయని మూసివేశారు.

ఇలా చేద్దాం

☛ గతంలో మాదిరిగానే బస్సులు లోపలికి వచ్చే మార్గాలు రెండు ఉండాలి.

☛ ఏటూరునాగారం, ములుగు, ఖమ్మం, మహబూబాబాద్, నర్సంపేట రూట్లలో వచ్చే బస్సులు హనుమకొండ చౌరస్తా మీదుగా మసీదు పక్క ఉన్న దారి గుండా లోపలికి వెళ్లాలి.

☛ హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్, జనగామ నుంచి వచ్చే బస్సులు జంక్షన్ వద్ద ఉన్న మార్గం ద్వారా లోపలికి వెళ్లే ఏర్పాటు చేయాలి.

☛ ప్రమాదాలు జరగకుండా సెక్యూరిటీ సిబ్బందితో పాటు ఇద్దరు ట్రాఫిక్ పోలీసులను ఉంచాలి. ప్రైవేటు వాహనాలు లోపలికి రాకుండా కట్టడి చేయగలిగితే ప్రమాదాలు జరగవు.



3 ఇది మసీదు పక్క నుంచి బస్టాండ్‌లోకి వెళ్లే దారి.. బస్సులన్నీ ఇక్కడి నుంచే లోపలికి వెళ్లాలి..

సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలి

- నార్లగిరి రమేష్, ప్రయాణికుడు, హనుమకొండ



బస్టాండు రోడ్డు నుంచి మచిలీబజార్, పద్మాక్షిరోడ్డుకు వెళ్లాలంటే కనీసం అరగంట సమయం పడుతోంది. ఆటోలు, ద్విచక్రవాహనాలు ఇష్టారీతిగా పార్కింగ్ చేసి ఉంటాయి. రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు నడుస్తున్నాయి. ట్రాఫిక్ పోలీసులతో పాటు, నగపాలక సంస్థ, ఆర్టీసీ అధికారులు సమన్వయంతో కృషి చేసి ఈ సమస్యకు పరిష్కారం చూపాలి.

ప్రైవేటు వాహనాలను అడ్డుకుంటున్నాం..

- విజయభాను, ఆర్టీసీ వరంగల్ రీజియన్ మేనేజర్



బస్టాండులోకి ప్రైవేటు వాహనాల రాకకు పూర్తిగా అడ్డుకట్ట వేశాం. కాజీపేట, ములుగు రోడ్డు, పెట్రోల్‌పంపుల నుంచి కొన్ని బస్సులను నేరుగా పంపించేందుకు అక్కడ అనువైన స్థలం లేదు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యేతో చర్చిస్తున్నాం.

వరంగల్ రీజియన్‌లోని ఆర్టీసీ డిపోలు	మొత్తం బస్సులు	నిత్యం హనుమకొండ బస్టాండుకు వచ్చే ప్రయాణికుల సంఖ్య	ఉమ్మడి ఆరు జిల్లాల నుంచి వచ్చే బస్సులు	ప్రయాణించే మార్గాలు
9	908	60 వేలు	1200	374



ములుగు రోడ్డు బస్టాండు

ఇదీ పరిస్థితి

హనుమకొండ బస్టాండు ఇరుకుగా ఉంటుంది. పక్కపక్కనే ప్లాట్‌ఫారాలు ఉండటంతో బస్సులు లోపలికి వచ్చి బయటకు వెళ్లాలంటే గంటల కొద్ది సమయం వృథా అవుతోంది. ప్రయాణికులూ తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

పరిష్కారం

☛ హైదరాబాద్ తరహాలో బస్ పాయింట్లు ఏర్పాటు చేయాలి. హైదరాబాద్ నగరంలో ఎంజీబీఎస్ ప్రధాన బస్ స్టేషన్ ఉన్నప్పటికీ కరీంనగర్ వైపు వెళ్లే బస్సులు ఎక్కువ సంఖ్యలో జూబ్లీ బస్ స్టేషన్ నుంచి నడుస్తాయి. వరంగల్ వెళ్లే బస్సులు ఉప్పల్ నుంచి నడుస్తాయి. అదే తరహాలో ఇక్కడ కరీంనగర్, ములుగు, నర్సంపేట, మహబూబాబాద్, హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలకు ప్రత్యేక బస్‌స్టేషన్ నుంచి పంపిస్తే ఇబ్బందులు తీరుతాయి.

☛ హైదరాబాద్ వెళ్లే బస్సుల్లో 20 శాతం బస్సులను హనుమకొండ బస్టాండు నుంచి కాకుండా కాజీపేట బస్టాండు నుంచి పంపిస్తే సగం ప్రయాణికులకు సమయం ఆదాతో పాటు ఆర్టీసీకి డీజిల్ ఆదా అవుతుంది. ట్రాఫిక్ సమస్యలు ఉండవు.

☛ ములుగు, ఏటూరునాగారం, నర్సంపేట, మహబూబాబాద్ వెళ్లే వాహనాలు నేరుగా ములుగు రోడ్డు నుంచి వెళ్లేలా చూడాలి.

☛ కరీంనగర్, నిజామాబాద్ బస్సుల్లో కొన్నింటిని హనుమకొండ పెట్రోల్ పంపు నుంచి నేరుగా పంపించొచ్చు.

☛ రిజర్వేషన్ బస్సులను సైతం మరో చోటు నుంచి పంపించే ఏర్పాటు చేస్తే సమస్య కొంత వరకు పరిష్కారం అవుతుంది.



కాజీపేట బస్టాండు



విలేకరుల సమావేశంలో కథానాయిక అనన్య, హీరో యువ చంద్రకృష్ణ

'పొట్టేల్' సినిమా బృందం సందడి


కాశీబుగ్గ, న్యూస్‌టుడే: నగరంలో 'పొట్టేల్' సినిమా బృందం సందడి చేసింది. ఆకట్టుకునే కథ, మెప్పించే కథనంతో ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న 'పొట్టేల్' సినిమాను ఆదరించాలని కథానాయకుడు యువ చంద్రకృష్ణ, కథానాయిక అనన్య ప్రేక్షకులను కోరారు. మంగళవారం వరంగల్ వెంకట్రామా థియేటర్ వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. వరంగల్‌కు చెందిన నిషాంత్ రెడ్డి, సురేశ్ చిత్రాన్ని నిర్మించారని, పక్కా పల్లె వాతావరణం, చిన్నపాప చదువు కోసం మేం పడిన కష్టం ఈ సినిమాలో కనిపిస్తుందని చిత్ర బృందం తెలిపింది. గురువారం సినిమా విడుదలవుతోందని, ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో ప్రచారం చేశామని, తెలంగాణలో వరంగల్ నుంచే మొదలు పెడుతున్నామని వివరించారు. ఓటీటీలో కాకుండా సినిమాను థియేటర్‌లోనే చూడాలని అభ్యర్థించారు. అంతకు ముందు హీరో యువ చంద్రకృష్ణ తీన్మార్ డాన్స్ చేశారు. సమావేశం అనంతరం సినిమా పోస్టర్లను ఆవిష్కరించారు. కథానాయిక అనన్యతో స్వీయచిత్రం దిగడానికి అభిమానులు పోటీపడ్డారు.

అథ్లెటిక్స్ పోటీలు వాయిదా

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఈ నెల 25న నిర్వహించాల్సిన అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు వాయిదా వేస్తున్నట్లు హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి సంస్థ అధికారి, అండర్-19 ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామన్నారు. ఇతర క్రీడాంశాలు షెడ్యూల్ ప్రకారమే ఉంటాయన్నారు.

చికెన్ ధరలు వెన్‌కాబ్ (కిలో వెల రూపాయలలో)			
ఫాంరేటు:	125	డ్రెస్డ్:	213
రిటైల్:	147	స్కిన్‌లెస్:	243

ప్రధాని మోదీ ప్రత్యుత్తరం.. మురిసిన విద్యార్థులు



प्रधान मंत्री
Prime Minister
New Delhi
01 October, 2024
Shri Nagchetanya Ji,
Heartfelt gratitude to you for sending warm birthday wishes.
...
(Narendra Modi)

గుండెంగ యూపీయస్ విద్యార్థులకు ప్రధాని రాసిన ప్రత్యుత్తరం



ప్రధాని రాసిన లేఖలతో గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

దేవరుప్పుల (జనగామ జిల్లా), మహబూబాబాద్ రూరల్, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గుండెంగ ప్రాథమికోన్నత పాఠశాలలో 6, 7వ తరగతుల విద్యార్థులు వారంతా.. పాఠశాల ఉపాధ్యాయుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత కొడిపాక రమేశ్ ప్రోత్సాహంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు సెప్టెంబర్ 17ను పురస్కరించుకొని జన్మదిన శుభాకాంక్షలు చెబుతూ హిందీలో లేఖలు రాసి పోస్టు చేశారు. సోమవారం ప్రధాని కార్యాలయం నుంచి 'ధన్యవాదాలు' అంటూ ప్రత్యుత్తరం అందింది. దీంతో ఆ పల్లె వాసులు, విద్యార్థుల ఆనందానికి అవధులు లేవు. మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు కిషన్, చీకటి శ్రీను, కందిక దామోదర్, ప్రధానోపాధ్యాయుడు రాజు సమక్షంలో వాటిని విద్యార్థులకు అందించడటంతో పండగ వాతావరణం నెలకొంది.

భద్రపరుచుకుంటాం..



- మణిహర్షిత, ఏడో తరగతి

గత నెలలో పోస్టుకార్డుతో ప్రధాని పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతూ మాస్టారు లేఖ రాయమంటే రాసి మరిచిపోయాం. ప్రస్తుతం తిరిగి లేఖ రావడంతో విద్యార్థులం అంతా చాలా ఆనందపడ్డాం. ఆంగ్లంలో వచ్చిన లేఖను ఉపాధ్యాయులు చదివి తెలుగులో వివరించారు. దేశ ప్రధాని నుంచి వచ్చిన ప్రత్యుత్తరం ఫ్రేమ్ కట్టించి ఇంట్లో భద్రపరుచుకుంటాం.

డమ్మీ పిస్టల్‌తో బెదిరింపు.. దుండగుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న పరకాల ఏసీపీ కిషోర్‌కుమార్

దామెర, న్యూస్‌టుడే: డబ్బు కోసం డమ్మీ పిస్టల్‌తో బెదిరించిన దుండగుడిని అరెస్టు చేసినట్లు హనుమకొండ జిల్లా పరకాల ఏసీపీ కిషోర్‌కుమార్ తెలిపారు. దామెర పోలీస్ స్టేషన్‌లో మంగళవారం వివరాలు వెల్లడించారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం పల్లిపాడుకు చెందిన రాయల వెంకటేశ్వర్లు 2006లో ప్రజాప్రతిఘటన పార్టీలో కొరియర్‌గా పనిచేసి, 2007లో ఖమ్మం ఎస్పీ ఎదుట లొంగిపోయాడు. తదనంతరం ఎన్ని పనులు చేసినా ఎక్కువ డబ్బు రాకపోవడంతో ఖమ్మం శివారులో పలు కిరాణా దుకాణాలకు వెళ్లి మాజీ నక్సలైట్‌నంటూ బెదిరించి డబ్బులు వసూలు చేశాడు. డమ్మీ పిస్టల్‌తో బెదిరిస్తే మరింత డబ్బు వసూలు చేయవచ్చని భావించి హైదరాబాద్‌లో డమ్మీ తుపాకీ కొనుగోలు చేశాడు. దీంతో అతనిపై ఖమ్మం జిల్లా పరిధిలో సుమారుగా 10కి పైగా కేసులు నమోదయ్యాయి. రూ. 800తో మరో నకిలీ తుపాకీ కొనుగోలు చేశాడు. వరంగల్‌లో నక్సలైట్ల ప్రభావం ఎక్కువగా ఉంటుందనే ఆలోచనతో ఈ నెల 21న ఖమ్మం నుంచి రైలులో వరంగల్‌కు చేరుకుని అర్ధరాత్రి వేళ ఊరుగొండ వద్ద ఆటో దిగాడు. అక్కడ కిరాణం దుకాణం యజమాని కందికొండ సంపత్‌ను నిద్రలేపి సిగరెట్ తీసుకుంటున్న క్రమంలో డమ్మీ పిస్టల్ చూపి డబ్బులు ఇవ్వాలని బెదిరించాడు. లేవని చెప్పిన సంపత్‌ను కిందపడేసి గల్లా పెట్టెలో రూ. 2000 తీసుకొని, తాను నక్సలైట్‌నని, ఎవరికైనా చెప్తే చంపేస్తానంటూ బెదిరించాడు. ఈ క్రమంలో సంపత్ దుండగుడు వెంకటేశ్వర్లును గట్టిగా పట్టుకుని కేకలు వేశాడు. వెంటనే చేరుకున్న స్థానికులు అతణ్ని బంధించి డమ్మీ పిస్టల్‌ను లాక్కొని పోలీసులకు అప్పగించారు. సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడు వెంకటేశ్వర్లును కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దుండగుడు వెంకటేశ్వర్లు వెనక ఇంకా ఎవరెవరు ఉన్నారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. వీరి వెంట సీఐ రంజిత్‌రావు, ఎస్సై అశోక్, ఉన్నారు.

సీతాఫలాల విక్రయాలు.. రాకపోకలకు తిప్పలు!



జనగామ పట్టణ శివారు హైదరాబాద్ రోడ్డు వైపు యూటర్న్ వద్ద బైపాస్ రహదారిపైనే సీతాఫలాల విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి గుండా వెళ్లే ప్రయాణికులు సీతాఫలాల కొనుగోళ్లకు ఆగడంతో కొంత మేర రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రహదారి పక్కగా కూర్చుంటే ఇబ్బందిగా ఉండదని విక్రయదారులుకు పోలీసులు సూచిస్తున్నారు.

– న్యూస్‌టుడే, జనగామ టౌన్


వరిసాగు అందం.. తేయాకు తోటల చందం



ఈ చిత్రం చూస్తుంటే అస్సాం రాష్ట్రంలోని తేయాకు తోటలను తలపిస్తున్నాయి కదూ. ఇది వరి విత్తనోత్పత్తి క్షేత్రం. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్ శివారులో కావేరి విత్తన సంస్థ ఆధ్వర్యంలో రైతు ఆడ, మగ వరిని నాటారు. మగ వరి కోసి వేరు చేయడంతో మిగిలిన పంట తేయాకు తోటలో పాదుల్లాగ ఇలా కనిపిస్తోంది. దారిన పోయే బాటసారులు ఎంతో ఆసక్తిగా తిలకిస్తున్నారు.

– ఈనాడు, హనుమకొండ, న్యూస్‌టుడే భీమదేవరపల్లి

హరిత గిరి.. కొలువైన శ్రీహరి



పచ్చదనంతో అలరారుతూ ఆహ్లాదకరంగా ఉన్న ఈ కొండ హనుమకొండ జిల్లా భీమారం పరిధిలోని ఎర్రగట్టు గుట్ట. దీనిపై అనేక రకాల ఔషధ మొక్కలు, మధుమేహాన్ని నియంత్రించే తిప్పతీగ, చర్మ వ్యాధులను నయం చేసేందుకు వాడే గడ్డిపూల జాతి మొక్కలు ఉన్నాయి. వీటితో నల్లనేరేడు, సీతాఫలాలు, వేప తదితర వృక్షాలు ఉన్నాయి. ఈ గుట్టపైనున్న ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువైన శ్రీహరి భక్తులకు కనులవిందుగా దర్శనమిస్తున్నారు.

– ఈనాడు హనుమకొండ, న్యూస్‌టుడే భీమారం

రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు ప్రారంభం



పోటీపడుతున్న క్రీడాకారులు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: తెలంగాణ చదరంగం సంఘం సహకారంతో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు మంగళవారం హనుమకొండలోని తిరుమల తిరుపతి దేవస్థానం వేడుకల మందిరంలో ప్రారంభమయ్యాయి. వరంగల్ చదరంగం సంఘం ఆధ్వర్యంలో అండర్-15 విభాగంలో నిర్వహిస్తున్న పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా 100 మంది బాలబాలికలు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యుడు ఈవీ. శ్రీనివాస్‌రావు హాజరై పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఓరుగల్లు క్రీడాకారుడు, గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ స్ఫూర్తితో రాణించాలని సూచించారు. అనంతరం బాలలతో చదరంగం ఆడి ఉత్తేజపరిచారు. పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా, ఆర్బిటర్స్ సాయిప్రదీప్, శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్, వైశాలి పాల్గొన్నారు.



పార్కు ముఖద్వారం



నెలకొన్న పచ్చదనం



ఓపెన్‌జిమ్‌లో కసరత్తు

ఆహ్లాదకరం యతిరాజారావు పార్కు

తొర్రూరు, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లాలో ఏకైక రెవెన్యూ డివిజన్ కేంద్రం తొర్రూరు. సుమారు 30 వేల పైచిలుకు జనాభా కలిగిన పట్టణానికి ఇతర ప్రాంతాల నుంచి రోజు సుమారు 2-3 వేల వరకు రాకపోకలు సాగిస్తుంటారు. దినదినాభివృద్ధి చెందుతున్న తొర్రూరులో ప్రజల సౌకర్యార్థం దివంగత నేత నెమరుగొమ్ముల యతిరాజారావు స్మారకంగా ఆయన పేరున ఏడెకరాల స్థలంలో పార్కును ఏర్పాటు చేశారు. మూడేళ్ల కింద మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు రూ. 2 కోట్లు కేటాయించి, అందులో ఓపెన్ జిమ్, పిల్లలు ఆడుకోవడానికి ఆటవస్తువులు, సేద తీరడానికి ప్రత్యేక బల్లలు, హట్స్, చూడముచ్చటైన విగ్రహాలు, ప్రత్యేకంగా వాటర్ ఫౌంటేన్‌ను ఏర్పాటు చేయడంతో ప్రజలకు ఆటవిడుపుగా నిలుస్తోంది. చుట్టూ వాకింగ్‌ట్రాక్, నర్సరీ నుంచి మొక్కలను తెప్పించి నాటడంతో పచ్చందాలను సంతరించుకుంటుంది. అలాగే ఇక్కడ విజయదశమి నాడు రావణవధ కూడా ఘనంగా నిర్వహిస్తారు. క్రీడా పోటీలు, పలు చిత్రాల షూటింగ్‌లు నిర్వహించిన దాఖలాలు ఉన్నాయి. నిత్యం 50 నుంచి 100 పిల్లలు కరాటే శిక్షణ పొందుతారు. ఇక సెలవు రోజుల్లో అయితే జనాల రాకతో కిక్కిరిసి కనిపిస్తుంది.

ప్రజా సమస్యలపై దృష్టి



గ్రామసభలో మాట్లాడుతున్న సీఐ కుమార్

వాజేడు, న్యూస్‌టుడే: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు పోలీసులు గ్రామస్థులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. జిల్లా ఎస్పీ శబరీశ్ ఆదేశాల మేరకు వాజేడు మండలంలోని గుమ్మడిదొడ్డి గ్రామస్థులతో వెంకటాపురం సీఐ బండారి కుమార్, వాజేడు ఎస్సై హరీశ్ మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గుమ్మడిదొడ్డి గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో యువత కోసం ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణం పాఠశాలలో ఉండటంతో ఆటలాడేందుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, మిషన్ భగీరథ పథకం నుంచి తాగునీరు రాని సమయంలో అవస్థలు తప్పడం లేదని స్థానికులు సీఐ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సీఐ సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. చదువుపై దృష్టి సారించాలని సూచించారు.

వంతెన కూలి నిలిచిన రాకపోకలు



బొమ్మాయిగూడెం(మంగపేట), న్యూస్‌టుడే: మండలంలోని బొమ్మాయిగూడెం గ్రామ సమీపంలోని గౌరారం వాగుపై నిర్మించిన లో లెవల్ వంతెన కింది భాగంలో బుంగ పడి మంగళవారం కూలిపోయింది. దీంతో బొమ్మాయిగూడెం గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. కొన్నేళ్ల క్రితం కొత్తూరు-మొట్లగూడెం-బొమ్మాయిగూడెం గ్రామాల మధ్య ప్రవహిస్తున్న గౌరారం వాగుపై లో లెవల్ వంతెనను ప్రభుత్వం నిర్మించింది. ఏటా వర్షాకాలంలో వరదల కారణంగా బ్రిడ్జి కొంతమేర కోతకు గురవుతూ.. శిథిలావస్థకు చేరింది. వంతెన తొలగించి హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్థులు ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించినా.. ఫలితం లేకుండా పోయింది. ఉన్న వంతెన సైతం కూలిపోవడంతో బొమ్మాయిగూడెం గ్రామానికి రవాణా పూర్తిస్థాయిలో నిలిచింది. గ్రామస్థులు పనుల నిమిత్తం సమీపంలోని మంగపేట, తాడ్వాయి మండలంలోని కాటాపురం వెళ్లాలన్నా వాహనాలు వాగుదాటే పరిస్థితి లేదు. కాలినడకన మాత్రమే అత్యవసరానికి వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందిస్తేనే గ్రామానికి రవాణా కొనసాగనుంది. కూలిపోయిన వంతెనను ఐటీడీఏ ఈఈ వీరభద్రం, డీఈ ప్రశాంత్‌రెడ్డి, ఏఈ రాము సాయంత్రం పరిశీలించారు. కూలిన ప్రదేశం కొలతలు తీసుకున్నారు. ఉన్నతాధికారులకు నివేదిస్తామని 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

వాజేడు: 8008573708, వెంకటాపూర్: 9440692140

ఏటూరునాగారం: 9440194979, వెంకటాపురం: 8008624242

రహదారిపై గుంతలు పూడ్చివేత



వాజేడు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని బీమారంకాలనీలో రహదారిపై గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయని, రాత్రివేళల్లో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని స్థానికులు 'మేమున్నాం.. మీకుతోడుగా'కు సమాచారం ఇచ్చారు. సమస్యను 'న్యూస్‌టుడే' చింతూరు పంచాయతీ కార్యదర్శి అశోక్‌కు వివరించగా ఆయన స్పందించారు. గుంతలను మొరంతో పూడ్చివేయించారు.

చెత్త సేకరణ

స్పందనకు వందనం

వెంకటాపురం, న్యూస్‌టుడే: వెంకటాపురం పట్టణంలోని ఉప తపాలా కార్యాలయం వీధిలో చెత్తచెదారం పేరుకుపోయిందని కాలనీవాసులు 'మేమున్నాం.. మీకుతోడుగా'కు వివరించారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించారు. కార్మికులను ఏర్పాటు చేసి శుభ్రం చేయించారు. ట్రాక్టర్ ద్వారా చెత్త నిల్వలను డంపింగ్ కేంద్రానికి చేర్చారు.

డ్రైనేజీలో పూడిక తీత

వెంకటాపురం, న్యూస్‌టుడే: వెంకటాపురం పంచాయతీ పరిధి శివాపురంలోని ఓ కాలనీలో డ్రైనేజీ పూడికమట్టితో నిండిందని స్థానికులు 'మేమున్నాం.. మీకుతోడుగా'కు సూచించారు. సమస్యను కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లగా ఆయన కార్మికులను అప్రమత్తం చేశారు. డ్రేనేజీలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

పాఠశాలలో స్వచ్ఛతకు చర్యలు



వెంకటాపురం, న్యూస్‌టుడే: మండలంలోని ఎదిర ప్రాథమికోన్నత పాఠశాలలో పిచ్చిమొక్కలు పెరిగి విద్యార్థులు ఆడుకునేందుకు ఇబ్బందిగా మారిందనే విషయాన్ని 'న్యూస్‌టుడే' పంచాయతీ కార్యదర్శి శృతి దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించారు. బ్లేడు ట్రాక్టర్‌ను ఏర్పాటు చేసి ప్రాంగణాన్ని, ఆరుబయట ప్రహరీ చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి స్వచ్ఛతగా మార్చారు.

దోమల నివారణకు..

ములుగు రూరల్, న్యూస్‌టుడే: ములుగు మండలం దేవనగర్ గ్రామంలోని అంతర్గత రోడ్లపై వ్యర్థాలు పేరుకుపోవడంతో దోమల వ్యాప్తి పెరిగిందని స్థానికులు 'మేమున్నాం..మీకుతోడుగా'కు సమాచారం ఇచ్చారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్‌కు దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. సిబ్బందితో దోమల నివారణకు బ్లీచింగ్ పోడి చల్లించారు.

వీధి దీపాల ఏర్పాటు



వెంకటాపురం, న్యూస్‌టుడే: ఎదిర పంచాయతీలోని పర్శిక గుంపులో వీధీ దీపాలను అమర్చారు. కాలనీలోని స్తంభాలకు లైట్లు లేకపోవడంతో రాత్రిపూట ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు సమస్యను 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. విషయాన్ని కార్యదర్శి శృతికి వివరించగా, ఆమె స్పందించారు. సిబ్బందిని అప్రమత్తం చేసి పలు ప్రాంతాల్లో వీధి దీపాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు



వాజేడు, న్యూస్‌టుడే: సారంగపురం గ్రామంలోని అంతర్గత రోడ్లకిరువైపులా ఏపుగా పిచ్చి మొక్కలు పెరిగాయని, విషపురుగులు సంచరించే అవకాశం ఉందని స్థానికులు 'మేమున్నాం.. మీకుతోడుగా'కు వివరించారు. సమస్యను 'న్యూస్‌టుడే' పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ దృష్టికి తీసుకెళ్లడంతో.. ఆయన స్పందించారు. పంచాయతీ సిబ్బందిని అప్రమత్తంచేసి రోడ్లకిరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

బొగ్గుల వాగుపై ఆనకట్ట నిర్మించాలి



సమావేశంలో పాల్గొన్న సీపీఐ నాయకులు

ములుగు రూరల్, న్యూస్‌టుడే: బొగ్గుల వాగుపై ఆనకట్ట నిర్మించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండీ అంజద్‌పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ములుగు మండలం కాసిందేవిపేట గ్రామంలో సీపీఐ మండల కార్యదర్శి ముత్యాల రాజు అధ్యక్షతన జరిగిన గ్రామ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వాపురం, జగ్గన్నగూడెం గ్రామాల మధ్య ఉన్న బొగ్గుల వాగుపై ఆనకట్ట నిర్మించాలని, ఏటా వర్షాకాలంలో ఆయాగ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాసిందేవిపేట గ్రామంలోని భూ సమస్యలను పరిష్కరించాలని, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామ కార్యదర్శి కట్ల సతీశ్, సహాయ కార్యదర్శి శ్రీనివాస్, కమిటీ సభ్యులు రమేష్, మొగిలి, సాంబయ్య, అశోక్, రాజకుమార్, నరేష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ పాఠశాలల నోడల్ అధికారులుగా ఎంఈవోలు



ఎంపికైన నర్మెట్ట ఆదర్శ పాఠశాల

దేవరుప్పుల (జనగామ జిల్లా), న్యూస్‌టుడే: పలు ప్రమాణాలను పరిగణలోకి తీసుకుని ఎంపిక చేసిన పీఎంశ్రీ (ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) నోడల్ అధికారులుగా మండల విద్యాధికారులకు అప్పగిస్తూ విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. పీఎంశ్రీ పథకం కింద గుర్తించిన పాఠశాలల్లో విద్యార్థి హితకర కార్యక్రమాలు అమలవుతున్న నేపథ్యంలో మరింత పారదర్శకంగా వీటిని సమన్వయం చేసేందుకు ఎంఈవోలకు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రంలో మొదటి దశలో 543 వర్తమాన సంవత్సరంలో మరో 251 పాఠశాలలను గుర్తించి ఈ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సైన్స్, మ్యాథ్స్ సర్కిళ్లు, విజ్ఞాన యాత్రల నిర్వహణ, సహా సృజనాత్మకత పెంచే పలు కార్యక్రమాలు, విద్యారంగ నిపుణులతో అతిథేయ ప్రసంగాలు నిర్వహించి వాటి కోసం నిధులను అందిస్తుంది. తరచూ పాఠశాలల సందర్శన విద్యార్థుల అభ్యసనా ఫలితాలను మెరుగుపరిచేందుకు మండల విద్యాధికారులు చొరవ తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో నిరుడు తొలి విడతగా 62 పాఠశాలలు వర్తమాన విద్యాసంవత్సరంలో 30 బడులను గుర్తించింది.

ఉమ్మడి వరంగల్‌లో పథకానికి ఎంపికైన పాఠశాలలు

జిల్లా	మొదటి దశ	రెండో
జనగామ	10	5
మహబూబాబాద్	17	6
భూపాలపల్లి	6	2
ములుగు	6	5
హనుమకొండ	13	6
వరంగల్	10	6

అసంక్రమిత వ్యాధుల నిర్ధారణకు పరీక్షలు



వాజేడు, న్యూస్‌టుడే: మాతాశిశు సంరక్షణ వైద్యబృందం ఆధ్వర్యంలో అసంక్రమిత వ్యాధులను (ఎన్‌సీడీ) గుర్తించేందుకు వాజేడు మండలంలోని కొప్పుసూరులో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఎంసీహెచ్ వైద్యాధికారి యోషిత మధుమేహం, రక్తపోటు నిర్ధారణకు పరీక్షలు చేసి అవసరమైన వారికి ఔషధాలను అందజేశారు. కాలానుగుణ వ్యాధులు వ్యాపించకుండా పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత కూడా అవసరమని అవగాహన కల్పించారు. బాలింతలు, గర్భిణులను పరీక్షించి ఆరోగ్య సలహాలు అందించారు. శిబిరంలో వైద్యపర్యవేక్షకుడు కోటిరెడ్డి, వైద్య సిబ్బంది సత్యనాగవేణి, ఛాయాదేవి, తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో ఉచితంగా చేతిపంపుల నిర్మాణం



వాడగూడెంలో చేతిపంపు ప్రారంభిస్తున్న స్వచ్ఛంద సంస్థ బాధ్యులు

వెంకటాపురం, న్యూస్‌టుడే: గ్రామీణుల దాహాన్ని తీర్చాలనే ఉద్దేశంతోనే స్వచ్ఛందంగా చేతిపంపుల నిర్మాణం చేపట్టినట్లు కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ లూర్థు రాజు అన్నారు. బాలవికాస, కాఫెడ్ స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా వెంకటాపురం మండలంలోని రామచంద్రాపురం, ఇప్పగూడెం, వాడగూడెం గ్రామాల్లో నిర్మించిన చేతిపంపులను మంగళవారం ప్రారంభించారు. స్వచ్ఛంద సంస్థకు చెందిన బృందం ఆ గ్రామాల్లో పర్యటించిన సమయంలో గిరిజనులు తాగునీటి ఇబ్బందులను తమ దృష్టికి తీసుకొచ్చినట్లు చెప్పారు. తమ వంతుగా పల్లెల చెంతకు రక్షితమైన జలాన్ని చేర్చాలనే లక్ష్యంతో సంయుక్తంగా రూ.లక్షలు వెచ్చించి వీటిని ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో బాలవికాస సంస్థ సమన్వయకర్త ప్రశాంత్, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భాస్కర్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

104 మందికి కంటి శస్త్ర చికిత్సలు



ఆపరేషన్లు చేయించుకున్న వారితో ట్రస్టు ఛైర్మన్ భూక్యా జంపన్న

ములుగు, న్యూస్‌టుడే: జంపన్న ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాదులోని శంకర కంటి ఆసుపత్రిలో ములుగు నియోజకవర్గానికి చెందిన పేదలు 104 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేయించారు. ట్రస్టు ఆధ్వర్యంలో ములుగులో స్క్రీనింగ్ నిర్వహించి ప్రత్యేక వాహనంలో వారిని హైదరాబాదు తరలించి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించారు. మంగళవారం సాయంత్రం ప్రత్యేక వాహనంలో ములుగు తీసుకొచ్చారు. ట్రస్టు ఛైర్మన్ భూక్యా జంపన్నకు ఆపరేషన్ చేయించుకున్నవారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇదే ట్రస్టు ద్వారా ఇటీవల 70 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేయించారు.

'ఆదివాసీల హక్కులను విస్మరిస్తున్న ప్రభుత్వాలు'



మాట్లాడుతున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ సతీశ్

వెంకటాపురం, న్యూస్‌టుడే: షెడ్యూల్ ప్రాంతంలోని ఆదివాసీల హక్కులు, చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ పర్శిక సతీశ్ అన్నారు. వెంకటాపురం మండల కేంద్రంలో మంగళవారం జరిగిన ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదో షెడ్యూల్ ప్రాంతంలో అభివృద్ధి సంక్షేమ పథకాలు, శాంతిభద్రతలు, నిబంధనలకు సంబంధించి ప్రత్యేకంగా రాష్ట్ర గవర్నర్ రూపొందించినా.. వాటిని దిక్కరిస్తున్నారన్నారు. 1/70, 1/59 చట్టాలను ఎందుకు ఆచరణలో పెట్టడం లేదని ప్రశ్నించారు. ఏజెన్సీలో గిరిజనేతరుల వలసలను నిరోధించాల్సిన అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్నారు. వలసలు అధికం కావడంతో ప్రభుత్వ భూముల ఆక్రమణ యథేచ్ఛగా సాగుతోందన్నారు. ఆదివాసీల జీవన విధానం, సంస్కృతీ సంప్రదాయాలను విచ్ఛిన్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మన్యంలో వలస నిరోధక చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, ఐదో షెడ్యూల్ నిబంధనలను విధిగా పాటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు తుర్స కృష్ణబాబు, ఉపాధ్యక్షుడు తాటి రాంబాబు, సభ్యులు కుర్సం శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మందులిచ్చే వారు లేక ఆందోళన



ఎంజీఎం అత్యవసర మందుల విభాగం వద్ద..

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: ఎంజీఎం ఆసుపత్రిలోని అత్యవసర విభాగం వద్ద ఉన్న మందుల విభాగంలో మాత్రలు ఇచ్చేవారు లేక రోగులు ఇబ్బందిపడ్డారు. ఆసుపత్రిలో ఓ ఏజెన్సీ ద్వారా ఫార్మసీ విభాగంలో ఎనిమిదేళ్లుగా ఆరుగురు ఫార్మాసిస్టులు పనిచేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన ఉద్యోగ నియామకాలకు వారు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ సంస్థలో పనిచేసిన అనుభవం ఉంటే కొన్ని మార్కులు కలుపుతామని నోటిఫికేషన్‌లో పేర్కొనడంతో వారంతా అనుభవ(ఎక్స్‌పీరియన్స్) ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని ఎంజీఎం సూపరింటెండెంట్‌ను కలిసి అడిగారు. మీరు పనిచేస్తున్న ఏజెన్సీ ధ్రువీకరిస్తే ఇస్తామని ఆయన సమాధానం చెప్పారు. ఏజెన్సీ వారిని అడిగితే అంగీకరించలేదు. దీంతో వారంతా మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్‌ను కలవడానికి వెళ్లారు. కలెక్టర్ కలవకపోవడంతో నిరాశతో ఇళ్లకు వెళ్లిపోయారు. వారి స్థానంలో వేరొకరిని విధుల్లో ఉండేలా చూడాల్సిన సూపర్వైజర్ పట్టించుకోలేదు. దీంతో ఎంజీఎం అత్యవసర విభాగంలో సాయంత్రం వేళ మందులిచ్చేవారు లేక రోగులు ఆందోళనకు దిగారు. విషయం సూపరింటెండెంట్ సీహెచ్ మురళి దృష్టికి వెళ్లడంతో పొరుగుసేవల ఫార్మాసిస్టును మందుల విభాగానికి పంపించారు. మందులిచ్చేలా చర్యలు తీసుకోవడంతో రోగులు శాంతించారు.

యువకుడి ఆత్మహత్య



జితేందర్‌సింగ్ (పాతచిత్రం)

ములుగు టౌన్, న్యూస్‌టుడే: పురుగు మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ములుగు మండలం మదనపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పోరిక జితేందర్ సింగ్(39) కుటుంబ సభ్యులతో గొడవపడి ఈ నెల 1న పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు ములుగు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు హనుమకొండ తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా, మంగళవారం సాయంత్రం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

ఎంజీఎంలో బయోమెట్రిక్ యంత్రాల చోరీ

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో రెండు బయోమెట్రిక్ యంత్రాలను గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం హాజరుకోసం వచ్చిన సిబ్బంది రెండు యంత్రాలు లేకపోవడాన్ని గుర్తించారు. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. సోమవారం సాయంత్రం 6.30 గంటల సమయంలో చోరీకి గురైనట్లు అనుమానిస్తున్నారు. స్థానికంగా సీసీ కెమెరాలున్నా.. యంత్రాలను కవర్ చేసేలా ఏర్పాటు చేయలేదు. ఒక అనుమానితుడిని గుర్తించి, సీసీ ఫుటేజీ చిత్రం విడుదల చేశారు. ఈ ఘటనపై మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎంజీఎం సూపరింటెండెంట్ డా. చిలుక మురళి తెలిపారు. సెక్యూరిటీ సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై వివరణ కోసం సంబంధిత ఏజెన్సీకి నోటీసులు జారీ చేసినట్లు సూపరింటెండెంట్ పేర్కొన్నారు.

చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడొద్దు

పలిమెల, న్యూస్‌టుడే : అసాంఘిక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై తమాషారెడ్డి అన్నారు. మంగళవారం పలిమెల గుత్తికోయగూడెంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించి ఎస్సై మాట్లాడారు. మావోయిస్టులకు సహకరించవద్దని, అనుమానిత వ్యక్తుల సంచారంపై సమాచారం పోలీసులకు ఇవ్వాలని సూచించారు. సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

కుమురంభీం జయంతి



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బోరునర్సాపురం(మంగపేట), న్యూస్‌టుడే: మండలంలోని బోరునర్సాపురం గ్రామంలోని గిరిజన ప్రాథమిక పాఠశాలలో మంగళవారం కుమురంభీం జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కుమురంభీం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు భాగ్యమ్మ, ఉపాధ్యాయులు రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా శ్రీపాల్‌రెడ్డిని గెలిపించండి



గోవిందరావుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో..

గోవిందరావుపేట, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి జరుగుతున్న ఎన్నికల్లో ఎమ్మెల్సీగా శ్రీపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యం ఇచ్చి గెలిపించాలంటూ పీఆర్‌టీయూ టీఎస్ నాయకులు పలువురు మంగళవారం గోవిందరావుపేట మండలంలోని పలు పాఠశాలల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టారు. పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు వేం యాకుబ్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు సంఘం నాయకులు గోవిందరావుపేట గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, పస్రా జడ్పీ ఉన్నత పాఠశాలతో కర్లపల్లిలోని గిరిజన సంక్షేమశాఖ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులను కలిసి ప్రచారం నిర్వహించారు. ఓటరు నమోదుకు సంబంధించిన ఫారాలను పలువురికి అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ మండలాధ్యక్షుడు కణతల నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి పాడియా తులసీరాం, అసోసియేట్ అధ్యక్షుడు మాలోత్ శ్రీరాములు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రాంగణ నియామకాల్లో 154 మంది ఎంపిక

నయీంనగర్, న్యూస్‌టుడే: హనుమకొండ కిషన్‌పురలోని చైతన్య డీమ్డ్ వర్సిటీలో మంగళవారం టీసీఎస్ కంపెనీ ప్రతినిధులు ప్రాంగణ నియామకాలకు మౌఖిక పరీక్షలు నిర్వహించారు. డిగ్రీ ఆఖరి సంవత్సరం విద్యార్థులు 215 మంది పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన 182 మందిని ఎంపిక చేశారు. వర్సిటీ ఛాన్సలర్ డా. సీహెచ్. పురుషోత్తంరెడ్డి, ఉప కులపతి ఆచార్య జి. దామోదర్, రిజిస్ట్రార్ ఆచార్య రవీందర్ ఎంపికైన వారిని అభినందించారు.

రైతులకు విత్తనాల పంపిణీ

దంతాలపల్లి: నూనె గింజల సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఎన్‌ఎఫ్‌ఎంఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా కన్సల్టెంట్ సారంగం పేర్కొన్నారు. దంతాలపల్లిలో జాతీయ ఆహార భద్రత పథకం కింద పలువురు రైతులకు పొద్దు తిరుగుడు విత్తనాలను అందించారు. అనంతరం బొడ్లాడ, దాట్ల, కుమ్మరికుంట్లలో వేరుశనగ, వరి పంటలను పరిశీలించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

పారిపోయిన విద్యార్థి అప్పగింత



ఏటూరునాగారం, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు పిల్లల అభిరుచులకను గుణంగా వ్యవహరించాలని ఎస్సై తాజుద్దీన్ అన్నారు. ఏటూరునాగారం పట్టణంలోని క్రీడా పాఠశాల నుంచి వెంకటాపురం మండలం బర్లగూడెం గ్రామానికి చెందిన జజ్జరి ఆనంద్-సుమలత దంపతుల కుమారుడు ముఖేష్(11) పాఠశాల నుంచి మంగళవారం పారిపోయాడు. ఈ నెల 21న తల్లి ముఖేశ్‌ను పాఠశాలలో చేర్పించి వెళ్లారు. మంగళవారం ఉదయం అల్పాహారం తీసుకున్న తర్వాత ఎవరికీ చెప్పకుండా బయటికి వచ్చి జాతీయ రహదారిపై పారిపోతుండగా అటుగా వెళుతున్న కానిస్టేబుల్ అజయ్ గుర్తించి ఏటూరునాగారం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. వివరాలు తెలుసుకుని తల్లిదండ్రులకు సమాచారం అందించి, వారికి అప్పగించారు. సమయస్ఫూర్తితో వ్యవహరించిన కానిస్టేబుల్‌ను ఎస్సైతో పాటు సిబ్బంది అభినందించారు.

పాదయాత్రను విజయవంతం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

రాజుపేట(మంగపేట), న్యూస్‌టుడే: మాలల మహా పాదయాత్రను విజయవంతం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కర్రి శ్యాంబాబు అన్నారు. మంగళవారం మంగపేట మండలం రాజుపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 25న మొదటి పాదయాత్ర భద్రాద్రికొత్తగూడెం జిల్లా భద్రాచలంలో ప్రారంభమై హైదరాబాద్ వరకు కొనసాగుతుందన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మాలలను విభజించాలని చూడటం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మానుకోవాలని సూచించారు. అనంతరం పాదయాత్రకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాలమహానాడు, మండల అధ్యక్షుడు మంచాల నాగేంద్రకుమార్, రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు చిట్టిమల్ల సమ్మయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగెర్ల రాజారత్నం, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పల్లికొండ యాదగిరి, నాయకుల రాజమల్ల సుకుమార్, తోట రమేష్, తదితరులు పాల్గొన్నారు.